రైతన్నా.. కల్తీలతో జాగ్రత్త!

- ఖర్చు ఎక్కువ.. దిగుబడిపై ప్రభావం
- ఎరువులు కొనేటప్పుడు రశీదు తప్పనిసరి
- పరీక్షించుకున్న తరువాతే వాడటం మేలు



శ్రీనివాస్, మండల వ్యవసాయ శాఖ అధికారి

హత్నూర(సంగారెడ్డి): కూరగాయల సాగు, ఉద్యానవన పంటలు, వాణిజ్య పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలని రైతులు ఎరువులను విరివిగా వాడుతుంటారని హత్నూర మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎరువుల్లో కల్తీ జరిగితే రైతులు తీవ్రంగా నష్టపోతారు, వేల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసే ఎరువుల్లో కల్తీ ఉంటే దాని ప్రభావం దిగుబడులపై చూపుతుంది. ఎరువుల్లో కల్తీని గుర్తించడం, ఎరువులను పరీక్షించడంపై హత్నూర మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ సలహాలు సూచనలపై సాక్షి ప్రత్యేక కథనం.

ప్రస్తుతం పట్టణాలు గ్రామీణ ప్రాంతాల్లోని మార్కెట్లోకి నాసిరకం, నకిలీ ఎరువులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పోషకాలు తక్కువగా ఉన్న వాటిని రైతులకు అంటగడుతున్నారు. అమ్మోనియం క్లోరైడ్, అమ్మోనియం సల్ఫేట్లలో ఉప్పు కలుపుతారు. సూపర్ ఫాస్ఫేట్‌లో సుద్దపొడి, జిప్సం, యూరియాలో సాధారణ ఉప్పు కలిపే అవకాశం ఉంది. ఎంటీపీలో ఇసుక, ఉప్పు కలిపే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గుళిక రూపంలోని సూపర్ ఫాస్ఫేట్ డీఏపీ లేదా ఎస్పీజే కాంప్లెక్స్ ఎరువులుగా నమ్మించి అమ్ముతుంటారు. సాధారణ ఉప్పును కూడా ఎంటీపీగా, లేక సల్ఫేట్‌గా, మెగ్నీషియం సల్ఫేట్, జింగ్ సల్ఫేట్‌గా విక్రయిస్తుంటారు.

ఎరువుల పరీక్షలు ఇలా చేసుకోవాలి..

ఒక పరీక్ష నాళికలో ఒక గ్రాము యూరియాను 5 మిల్లీ లీటర్ల నీటిలో వేసి బాగా కలియబెట్టాలి. చుక్కల సిల్వర్ నైట్రేట్ ద్రావణంలో కలపాలి.. తెల్లటి అవక్షేపంగా మారితే అది కల్తీ ఎరువుగా గుర్తించాలి. పొడిలా తయారు చేసుకున్న గ్రాము డీఏపీని పరీక్ష నాళికలో వేసి 5 మిల్లీ లీటర్ల స్వచ్ఛమైన నీటిలో కలపాలి. దానికి ఒక మిల్లీ లీటర్ నైట్రిక్ యాసిడ్ వేసి కలిపితే అర్ధ పారదర్శక ద్రావణం ఏర్పడితే అది నాణ్యమైనదిగా, అలా కాకుండా కరగని పదార్థం అడుగు భాగంలో చేరితే కల్తీదిగా భావించాలి. పరీక్ష నాళికలో ఒక గ్రాము మ్యూరేట్ ఆఫ్ పొటాష్(ఎంఓపీ) ఎరువులో 5 మిల్లీ లీటర్ల నీటిని పోసి బాగా కరిగేటట్లు చేయాలి. కొద్దిపాటి ఎరువు పదార్థం నీటిపై తేలితే స్వచ్ఛమైన ఎరువుగా, ఎక్కువ మొత్తంలో కరగకుండా అడుగు భాగం చేరితే అది కల్తీ ఎరువుగా గుర్తించాలి.



దుకాణంలో ఎరువులు



ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఝాన్సీ

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

సంగారెడ్డి టౌన్: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ శాఖ అధికారిణి ఝాన్సీ హెచ్చరించారు. గురువారం మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు విక్రయించొద్దని.. నాణ్యమైన విత్తనాలు మాత్రమే అమ్మాలన్నారు. ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు రశీదులు ఇవ్వాలని.. స్టాక్ బోర్డును తప్పనిసరిగా కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో మండలశాఖ అధికారులు, దుకాణదారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ



ప్రభుత్వ విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న ఎల్ఐసీ అధికారులు

సంగారెడ్డి : ఎల్ఐసీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఫౌండేషన్ డే సందర్భంగా సంగారెడ్డిలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా శాఖ క్లాస్ -1 ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు పోతిరెడ్డిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ డివిజన్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రకాష్ మాట్లాడుతూ.. అసోసియేషన్ ఫౌండేషన్ డే సందర్భంగా ప్రతి సంవత్సరం ఒక సేవా కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించాలని స్పోర్ట్స్ సామగ్రిని అందజేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సతీష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గీత, వ్యాయమ ఉపాధ్యాయులు పాండు, జ్యోతిర్మయి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పెంచిన వేతనం ఇవ్వాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి జోన్: మున్సిపల్ కార్మికులకు పెంచిన వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఆర్డీఓ రవీందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్‌తో పాటు ఇతర పద్ధతుల్లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలన్నారు. రెండవ పీఆర్సీలో కనీస వేతనం రూ.26,000లుగా నిర్ణయించాలని, ఆ లోపు ఇతర రాష్ట్రాల్లో ఇస్తున్నట్లుగా రూ.21,000 వేతనం అమలు చేయాలని, కేటగిరీల వారీగా వేతనాలు ఇవ్వాలన్నారు. కార్మికుల వయస్సు పైబడిన, అనారోగ్యానికి గురైన, చనిపోయిన కార్మికుల స్థానంలో వారి వారసులకే ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మున్సిపల్ యూనియన్ నాయకులు రాజు, కృష్ణ సంగమేశ్వర్, ఆంజనేయులు, రవి, జనార్దన్, గోవర్ధన్, సాయిలు పాల్గొన్నారు.

దైవభక్తితో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: మానసిక ప్రశాంతతకు ప్రతి ఒక్కరు దైవభక్తిని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని పోచారం గ్రామంలో సోమవారం నిర్వహించిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవం కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, భిక్షపతి, రాజు, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే దంపతులను సన్మానించిన నిర్వాహకులు

క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

ఎంపీ సురేష్ షెట్కార్

జహీరాబాద్ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుందని ఎంపీ సురేష్ షెట్కార్ పేర్కొన్నారు. మండల కేంద్రం మొగుడంపల్లి జరిగిన క్రికెట్ చాంపియన్ లీగ్ టోర్నమెంట్ విజేతలకు సోమవారం బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఆటలతో ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో క్రీడానైపుణ్యం కలిగిన యువత ఉందని, వారి ప్రతిభను గుర్తించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. క్రీడలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్శిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అందుకని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువకులు ఆటలపై శ్రద్ధ చూపి ప్రతిభ చాటాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మక్సూద్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్‌గౌడ్, నాయకులు హన్మంత్ రావు పాటిల్, నర్సింలు హర్షద్ పటేల్, వంశీరాజ్, అశోక్, అవినాష్ పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎంపీ, మాజీ మంత్రి

అభివృద్ధిపై సమీక్ష

జహీరాబాద్: నియోజకవర్గం అభివృద్ధిపై ఎంపీ సురేష్‌షెట్కార్ ఆయా శాఖల అధికారులతో సోమవారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ రహదారుల నిర్మాణం, పంచాయత్‌రాజ్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, సమస్యల గురించి అడిగారు. అభివృద్ధి పనులు వేగిరంగా జరిగేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్, ఐడీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తన్వీర్ పాల్గొన్నారు.

యువత ఎదుగుదలకు కృషి



శివచరణ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ

నారాయణఖేడ్: యువత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన శివచరణ్ రెడ్డికి ఎంపీ సురేష్‌షెట్కార్ సూచించారు. సోమవారం హైదరాబాద్‌లో ఎంపీని శివచరణ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం శివచరణ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి ఎంపీ సురేష్ షెట్కార్ అభినందించారు.

ఆస్పత్రి సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పటోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆస్పత్రి ఆవరణలో ఇందిరా మహిళాశక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక మహిళలు ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ప్రారంభించారు. అనంతరం సూపరింటెండెంట్ డా. రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 50 పడకల మాతా, శిశుసంరక్షణ కేంద్రంలో అదనపు పడకల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. ఆర్వోప్లాంట్, బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు చేయిస్తామన్నారు. వైద్యులతో పాటు సిబ్బంది మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయాలని సూచించారు. ఆర్డీఓ అశోకచక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారంశంకర్, కౌన్సిలర్ వివేకానంద్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకట్రావు, తాహెర్‌అలీ, ముంతాజ్, అవుటిశంకర్, దిల్‌దార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డిని గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపుమలె శెట్టి, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్, సీనియర్ నాయకులు సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పేదలకు వైద్యం ప్రభుత్వ సంకల్పం

కల్హేర్(నారాయణఖేడ్): పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ సంకల్పమని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. సోమవారం సిర్గాపూర్ మండల కేంద్రంలో 108 అంబులెన్స్ సేవలు ప్రారంభించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ సిబ్బంది, ఆశావర్కర్లు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను సన్మానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాదరెడ్డి, జయరాజు, పీరప్ప, అనంత్‌రెడ్డి, మహేశ్వర్‌సేట్, సాయిలు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పుష్ప తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్ కాలనీలో సోమవారం కార్పొరేటర్ పుష్పనగేష్ ఇంజనీరింగ్ అధికారులతో కలసి పర్యటించారు. కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్డుల సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీవాసులు తన దృష్టికి తెచ్చిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రఘురాంరెడ్డి, కాలనీవాసులు విఠల్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు



హత్నూరలో ఉదయం ఇలా..

హత్నూర (సంగారెడ్డి): మండల కేంద్రం హత్నూరను పొగ మంచు సోమవారం దట్టంగా కమ్మేసింది. ఉ. 9 గంటలు అవుతున్నా పొగ మంచు కమ్మేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రోజురోజుకు చలి పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పొగ మంచు కమ్మేయడంతో రహదారులు, చెట్ల మధ్య నుంచి సూర్యుడు బయటకు వస్తుండటం ఆకర్షణీయంగా కనిపించింది.

మాదకద్రవ్యాలపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీఓ ఉమాదేవి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం బొంతపల్లి కమాన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు యువజన సంఘాల సమితి నాయకులు సోమవారం మాదకద్రవ్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండల అభివృద్ధి అధికారి ఉమాదేవి హాజరయ్యారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... యువత మద్యం గంజాయి, డ్రగ్స్, గుట్కా వంటి మత్తుకు అలవాటు పడి జీవితాన్ని చిన్నాభిన్నం చేసుకోవద్దన్నారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం జానపద కళాకారుల ఆట పాటలతో గ్రామస్తులకు చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో మండల యువజన సంఘాల సమితి నాయకులు యువకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీజేపీ కార్యాలయం ముట్టడి



నినాదాలు చేస్తున్న నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను అవమానించిన తీరుకు నిరసనగా సోమవారం మాలమహానాడు నాయకులు రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బీజేపీ కార్యాలయాలన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా అధ్యక్షుడు మల్లేశం మాట్లాడుతూ.. అమిత్‌షాను తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయడంతో పాటు దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బి జనార్దన్, రవీందర్, గోపాల్ విజయరాజ్, అనంతయ్య, పురుషోత్తం విశ్వనాథం ఆకాష్, దిలీప్‌కుమార్, కర్ణాకర్, ధనరాజ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన



ప్రిన్సిపాల్స్‌తో ఉపాధ్యాయులు

మునిపల్లి(అందోల్): విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని ఆయా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్ అబ్జర్వర్లు టీనావతి, సువర్ణ, దినా, రవీందర్ పేర్కొన్నారు. సోమవారం మునిపల్లి మోడల్ స్కూల్‌లో ఆయా తరగతుల రికార్డులను తనిఖీ చేశారు. అధ్యాపకులు బోధిస్తున్న తీరును పరిశీలించారు. ఆయా తరగతుల విద్యార్థులు అంకిత భావంతో చదివి అధిక మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో మునిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లిక, శ్రీలక్ష్మి, అశోక్ కుమార్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలఉత్పత్తులు పెంచాలి



పోటీలను ప్రారంభించిన యామిని

సంగారెడ్డి టౌన్ : రైతులు పాల ఉత్పత్తిని పెంచాలని మండల పశుసంవర్ధక శాఖ అధికారిణి యామిని అన్నారు. సోమవారం సంగారెడ్డి పట్టణం గొల్లగూడెంలో అధిక పాల దిగుబడి ఇచ్చే గేదెలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాల ఉత్పత్తిని పెంచాలంటే వాటికి తగిన ఆహారాన్ని అందిస్తూ ఉత్పత్తులను పెంచేలా చూడాలన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన గేదెల యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లాడె మనీలా, మల్లేశం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి



సీఐకి వినతిపత్రం అందజేస్తున్న జాకీర్ హుస్సేన్

జహీరాబాద్: న్యాల్‌కల్ మండలంలోని గంగ్వార్ వద్ద ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని జహీరాబాద్ డిపో మేనేజర్ జాకీర్ హుసేన్ రూరల్ సీఐ హన్మంత్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం ఈ మేరకు కబ్జాకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రయాణీకుల వినియోగానికి అనువుగా మార్చుటకు సహకరించాలని కోరారు. ఆర్టీసీ ఆస్తుల పరిరక్షణకు పాటుపడతామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, మేనేజర్ శ్రీనివాస్, రాజు, నరేందర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలతో లబ్ధి

జహీరాబాద్ టౌన్: ఆర్టీసీ అమలు చేస్తున్న కార్గో సేవలను ప్రజలు, వ్యాపారులు వినియోగించుకోవాలని ఉమ్మడి మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(ఏటీఎం)ఇసాక్ పేర్కొన్నారు. సోమవారం ఆయన బస్టాండ్‌లోని కార్గో ఆఫీస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇసాక్ మాట్లాడుతూ.. అతి తక్కువ ఖర్చుతో, వేగంగా భద్రంగా.. సరుకు రవాణా కార్గో సేవల ద్వారా అందుతుందన్నారు. ముఖ్య పట్టణాల్లో డోర్ డెలివరీ సదుపాయం కూడా ఉందన్నారు. కార్గో సేవల ద్వారా ఆర్టీసీకి ఆదాయం వస్తుందన్నారు. ప్రైవేట్ పార్సల్ కొరియర్లకు ధీటుగా ఆర్టీసీ కార్గో ద్వారా సత్వర సేవలను అందిస్తున్నామని, సిబ్బంది కూడా చక్కగా పనిచేస్తున్నారని చెప్పారు.

సంక్షిప్త వార్తలు

◆ నూతన నియామకం

జహీరాబాద్: కోహీర్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా బి.రవికుమార్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా రాజు, దయానంద్, మద్రిరాజు, ప్రధాన కార్యదర్శిగా రాజేందర్, సహాయ కార్యదర్శులుగా పవన్, రమేష్, నరేష్, నితిన్, సభ్యులుగా సుదీష్‌కుమార్, సునీల్‌కుమార్, సందీప్, అవినాష్, రాజు, చిన్న, శ్రీకాంత్, చింటు, యోహాన్, నర్సింహులు, ప్రేమ్‌రాజ్, నితీష్, మహేందర్, చిరంజీవి, రాహుల్, అబ్రహం, నర్సింలు, సురేష్, ధన్‌రాజ్, తుల్జరామ్‌లను ఎన్నుకున్నారు.

◆ బాధిత కుటుంబానికి పరామర్శ

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం నాగధర్‌లో ఇటీవల మరణించిన సత్యాగౌడ్ కుటుంబాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ నరసింహారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ అడివప్ప, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాజు, మోహన్‌సాగర్, విట్టల్‌గౌడ్, అనిల్‌గౌడ్ ఉన్నారు.

◆ సమాధుల తొలగింపుపై ఆగ్రహం

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం చింతల్ చెరువు గ్రామ శివారులోని సమాధులను తొలగించడంపై సోమవారం స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 419లో నాలుగు గుంటల భూమి ఎస్సీ కులానికి చెందిన కొన్ని కుటుంబాలకు సమాధుల నిమిత్తం గతంలో గ్రామానికి చెందిన ఓ దాత విరాళంగా ఇచ్చారు. అప్పటి నుంచి వారు ఎవరు చనిపోయిన అక్కడే సమాధి చేస్తున్నారు. అదే సర్వే నంబర్‌లోని కొంత భూమిని హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి కొనుగోలు చేసి, సమాధులు పెట్టిన స్థలం నాదంటూ తొలగించడంపై స్థానికులు మండిపడ్డారు. ఈ విషయమై రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాధులను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

◆ మల్లన్నస్వామి ఆశీస్సులుండాలి

పటాన్‌చెరు టౌన్: మల్లన్న స్వామి ఆశీస్సులు ప్రజలపై ఉండి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని నీలం మధు అన్నారు. సోమవారం పోచారంలో మల్లన్న స్వామి జాతరలో పాల్గొన్నారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ.. జాతరలు ఉత్సవాలు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తాయన్నారు.

◆ అనుమతి లేని షెడ్డు కూల్చివేత

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం ఎన్రిచ్ ఏరియాలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు చేశారు. పారిశ్రామికవాడలోని సర్వేనంబర్ 81, 84 లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న షెడ్డును కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ సిబ్బంది నవీన్ బృందం సోమవారం కూల్చి వేయించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

◆ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

సంగారెడ్డి: సంగారెడ్డిలో నీలి కుల సంఘం క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అంజయ్య మాట్లాడుతూ.. నీలి కుల సంఘం బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

◆ సీఐటీయూతోనే కార్మికుల సంక్షేమం

జహీరాబాద్ టౌన్: సీఐటీయూతోనే కార్మికుల సంక్షేమ సాధ్యమని జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం అన్నారు. పట్టణ సమీపంలో గల అల్లా పరిశ్రమలో జరగనున్న కార్మిక యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో భాగంగా సోమవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సీఐటీయూ నిత్యం కార్మికుల గురించి ఆలోచన చేస్తుందన్నారు. మెరుగైన వేతన ఒప్పందం కోసం కృషి చేస్తుందన్నారు. 9న జరగనున్న ఎన్నికల్లో సీఐటీయూని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మహిపాల్, నాయకులు రాజిరెడ్డి, వంశీ, సందీప్‌రెడ్డి, నారాయణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ అమీన్‌పూర్ సీఐగా నరేష్

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ సీఐగా నరేష్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత అమీన్‌పూర్ సీఐ సదా నాగరాజు మల్టీజోన్-2 వీఆర్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో డీఎస్‌బీ మహబూబ్‌నగర్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న నరేష్ రానున్నట్లు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

◆ ఖోఖో జాబితాలను అందజేయాలి

సంగారెడ్డి: ఉమ్మడి మెదక్ జిల్లాలో మండలాల వారీగా ఖోఖో రిజిస్ట్రేషన్ చేసుకున్న జాబితాను అడాక్ కమిటీకి అందజేయాలని ఖోఖో ఉమ్మడి మెదక్‌జిల్లా అడహక్ కమిటీ కన్వీనర్ వై.మహేందర్రావు కోరారు. మండలాలు, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులతో రిజిస్ట్రేషన్ చేయించిన క్లబ్, సొసైటీల డాక్యుమెంట్లను ఖోఖో అడహక్ కమిటీ సభ్యుడు, చేగుంట మండలం వడియారం పాఠశాల పీడీ ఎస్.నాగరాజుకు అందజేయాలని ఆయన సూచించారు. వివరాలకు 98665 46563 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

◆ మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 18 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపరచగా నలుగురికి ఒక్కొక్కరికి రూ. 1500, మరో 14 మందికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ సమగ్ర ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం డిమాండ్ చేశారు. సోమవారం సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు కేవీపీఎస్ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ.. విద్యాశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు గత 31 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా 20 వేల మంది సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టినట్టుగా వ్యవహరిస్తుందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడి వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, జిల్లా సహాయ కార్యదర్శులు ప్రవీణ్, రాజు జిల్లా కమిటీ సభ్యులు నరేష్,సు ధాకర్, శ్రీకాంత్, నాగభూషణం పాల్గొన్నారు.

◆ పేదలకు రగ్గుల పంపిణీ

జోగిపేట(అందోల్): జోగిపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం చలికాలం దృష్ట్యా పేదలకు రగ్గులు పంపిణీ చేశారు. స్థానిక జోగినాథ దేవాలయం వద్ద ఉన్న పేదలకు జోగిపేట మున్సిపల్ కమిషనర్ తిరుపతి, లయన్స్ క్లబ్ జిల్లా కార్యదర్శులు డాక్టర్ అనంతరెడ్డి, ఆకుల రాంబాబు, జోగిపేట అధ్యక్షుడు అల్లే శ్రీకాంత్ చేతుల మీదుగా దుప్పట్లను అందజేశారు. కమిషనర్ తిరుపతి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఈ సీజన్‌లో పేద ప్రజలకు రగ్గులను పంపిణీ చేసి వా రిని చలిబారి నుంచి కాపాడుతున్నా లయన్స్ క్లబ్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి సంతోష్, సంతోష్, మల్లేశం పాల్గొన్నారు.